సాక్షి
ఖమ్మం
గురువారం । 5, అక్టోబర్ । 2023



మల్లవరం.. మళ్లీ ముందంజ
తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన 13మంది యువత కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికై సత్తా చాటారు. IIలో



పోరులో మనమే గెలవాలి
ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ గురువారం మొదలుకానుండగా భారత జట్టు గెలవాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. IIలో

గరిష్టం / కనిష్టం
35° / 20°

వాతావరణం
జిల్లా అంతటా గురువారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు


బిందుప్రియ


రజిని

ఖమ్మంలీగల్: ఖమ్మం జిల్లా కోర్టుకు కేటాయించిన జూనియర్ సివిల్ జడ్జిలు ఏపూరి బిందు ప్రియ, బెక్కం రజిని గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడకు చెందిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బిందుప్రియ సిద్ధార్థ లా కళాశాలలో న్యాయ విద్యనభ్యసించారు. 2020లో ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా నమోదై ప్రాక్టీస్ ఆరంభించిన ఆమె జూనియర్ సివిల్ జడ్జిగా కావడంతో ఖమ్మంలో తొలి పోస్టింగ్ వచ్చింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన బిందుప్రియ మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఇక సంచార న్యాయస్థానం న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన రజిని కూడా విజయవాడ సిద్ధార్థ లా కళాశాలలో న్యాయ విద్యనభ్యసించారు. 2019లో న్యాయవాదిగా నమోదు చేసుకుని విజయాడ కోర్టులో ప్రాక్టీస్ చేశారు. తాజాగా జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో ఖమ్మం సంచార న్యాయస్థానం న్యాయమూర్తిగా పోస్టింగ్ లభించింది. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని రజిని ఆమె తెలిపారు.

సత్తుపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా లావణ్య


మాట్లాడుతున్న లావణ్య

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వద్ది లావణ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రా యూనివర్సిటీలో 2021లో న్యాయవిద్య పూర్తిచేసిన ఆమె పాలకొల్లులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. సత్తుపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఆయేషాసరీన్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ కావడంతో లావణ్యను నియమించగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, జూనియర్ సివిల్ జడ్జి ఆయేషాసరీన్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాలపాటి శ్రీనివాసరావు, బొర్రా వెంకట్రావు, న్యాయవాదులు మృణాళిని, వెంకట్రావు తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

పన్నుల వసూళ్లలో వేగం పెంచాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ హరికిషన్

రఘునాథపాలెం: నిధులు ఉంటేనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించి ఇంటి పన్నుల వసూళ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) హరికిషన్ సూచించారు. మండలంలోని రేగుల చెలక గ్రామపంచాయతీలో బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన డీపీఓ ఇంటి పన్నుల వసూళ్లపై ఆరా తీశారు. అలాగే, చెత్త సేకరణ, తాగునీటి సరఫరా తీరుపై సూచనలు చేశారు. ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రామారావు, పంచాయతీ కార్యదర్శి సంగీత, ఉప సర్పంచ్ నున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో ఎన్‌క్వాస్ బృందం


సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

చింతకాని: మండలంలోని నాగులవంచ ఆరోగ్య ఉపకేంద్రాన్ని నేషనల్ హెల్త్ మిషన్ జాతీయ ప్రమాణాల అధికారుల బృందం(ఎన్‌క్వాస్) బుధవారం సందర్శించింది. ఈసందర్భంగా కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశాక కేంద్రంలోని సౌకర్యాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. ఎన్‌క్వాస్ బృందం అధికారులు డాక్టర్ నాగిరెడ్డి, అమరజ్యోతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ నీలోహనతో పాటు ఉపేందర్, డాక్టర్ తోళ్ల వెంకటేశ్వర్లు, కృష్ణారావు, పండరీబాయి పాల్గొన్నారు.

ఆమెదే నిర్ణయాధికారం !



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు స్వీకరించిన అధికారులు పరిశీలన అనంతరం అర్హులైన ఓటర్ల లెక్క తేల్చారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధి 21 మండలాల్లో 1,439 పోలింగ్ బూత్‌లు ఉండగా.. 11,96,293మంది ఓటర్లతో బుధవారం తుదిజాబితా విడుదల చేశారు. ఇందులో పురుషులు 5,80,411 మంది, మహిళలు 6,15,807మందితో పాటు ఇతరులు 75మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. కాగా, జిల్లాలోని మొత్తం ఓటర్లతో పాటు ప్రతీ నియోజకవర్గంలోనూ మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడంతో రానున్న ఎన్నికల్లో వారిదే నిర్ణయాధికారం కానుంది. – ఖమ్మం సహకారనగర్

- జిల్లాలో మహిళా ఓటర్లే ఎక్కువ
- తుది జాబితా విడుదల చేసిన అధికారులు
- మొత్తం ఓటర్లు 11,96,293 మంది
- పురుషులతో పోలిస్తే మహిళలు 35,396 అధికం
- అన్ని నియోజకవర్గాల్లోనూ అతివలదే అగ్రస్థానం

విస్తృత ప్రచారం

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అర్హులైన వారందరినీ ఓటర్లుగా చేర్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికారులు విస్తృత ప్రచారం చేశారు. అలాగే, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆగస్టులో ముసాయిదా జాబితా ప్రకటించాక కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరించారు. ఇందు కోసం రెండేసి శనివారాలు, ఆదివారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.గత నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి పరిశీలన అనంతరం బుధవారం ఓటర్ల తుదిజాబితాను వెల్లడించారు. ఈమేరకు జిల్లాలో 11,53,987మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేలగా... జాబితాను గుర్తింపు పొందిన అన్ని పార్టీల ప్రతినిధులకు అందించినట్లు జిల్లా అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ వెల్లడించారు.

పెరిగిన ఓటర్లు 35,396 మంది

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 35,396మంది ఓటర్లు పెరిగారు. జిల్లాలో 1455 పోలింగ్ బూత్‌లు ఉండగా.. ఆగస్టు 21న ముసాయిదా జాబితా ప్రకటించారు. ఆ జాబితా ప్రకారం 11,24,821మంది ఓటర్లు ఉండగా కొత్తగా 80,491 దరఖాస్తులు అందాయి. వీటి పరిశీలన అనంతరం అర్హుల దరఖాస్తులను ఆమోదించి జాబితాలో చోటు కల్పించారు. అలాగే, అదనంగా ఎన్ఆర్ఐ ఓటర్లు, సర్వీస్ ఓటర్లు కూడా జాబితాలో పేరు నమోదు చేసుకున్నారు. దీంతో జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 11,96,293కు చేరింది. ఫలితంగా ముసాయిదాతో పోలిస్తే జిల్లాలో 71,472 మంది ఓటర్లు పెరిగారు.

యువత ఆసక్తి

అర్హులైన యువతీ, యువకులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని అధికారులు కళాశాలల్లో విస్తృత ప్రచారం చేశారు. దీంతో మంచి స్పందన లభించింది. అధికారులు విడుదల తుది ఓటర్ల జాబితాలో 44,204 మంది 18నుంచి 19ఏళ్ల వయస్సు ఓటర్లు ఉన్నట్లు వెల్లడైంది. కాగా, ఖమ్మం నియోజకర్గంలో ఈ వయస్సు ఓటర్లు 12,025 మంది ఉన్నారు.

వయోవృద్ధులు 16,761మంది

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 80ఏళ్ల వయస్సు పైబడిన ఓటర్ల వివరాలను అధికారులు వెల్లడించారు. ఈమేరకు 16,761 మంది ఉన్నట్లు తేలింది. ఈ వయస్సు కేటగిరీలోనూ ఖమ్మం నియోజకవర్గంలో అత్యధికంగా 3,937 మంది ఉండగా.. తక్కువగా పాలేరు నియోజకవర్గంలో 2,702మంది వయోవృద్ధులైన ఓటర్లు ఉన్నారు.

దరఖాస్తులిలా...

కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం జూలై 16వ తేదీ నుంచి ఆగస్టు 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా.. 80,491 దరఖాస్తులు అందాయి. వీటి పరిశీలన అనంతరం 71,428మందికి ఓటు హక్కు కల్పించారు. ఫారం–6(ఓటరు నమోదు)కు 31,428 దరఖాస్తులు రాగా 28,144, ఫారం–7(తొలగింపు)కు 27,759దరఖాస్తులు రాగా 23,637, ఫారం–8(చిరునామా మార్పు) కోసం 21,304దరఖాస్తులు రాగా 19,647 దరఖాస్తులను ఆమోదించారు.

మహిళా ఓటర్లే కీలకం

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నట్లు తుది జాబితాలో వెల్లడైంది. మొత్తంగానైనా, నియోజకవర్గాల వారీగానైనా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లా మొత్తం జాబితాలో 35,396 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఖమ్మం నియోజకవర్గంలో మహిళా ఓటర్లతో పోలిస్తే 12,333 ఎక్కువగా ఉంది. దీంతో రానున్న ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్ర కీలకంగా మారనుందని భావిస్తున్నారు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,51,673	1,64,006	47	3,15,726
పాలేరు	1,12,607	1,19,994	05	2,32,606
మధిర	1,05,978	1,12,599	08	2,18,585
వైరా	93,185	97,563	07	1,90,755
సత్తుపల్లి	1,16,968	1,12,645	08	2,38,621
మొత్తం	5,80,411	6,15,807	75	11,96,293

ఎన్ఆర్ఐ, సర్వీస్ ఓటర్లు, దివ్యాంగులు, వయోవృద్ధులు, యువ ఓటర్లు

నియోజకవర్గం	ఎన్ఆర్ఐ	సర్వీస్	దివ్యాంగులు	80ఏళ్ల వయస్సు పైబడిన వారు	18-19 ఏళ్ల ఓటర్లు
ఖమ్మం	69	75	3,651	3,937	12,025
పాలేరు	06	164	7,717	2,702	9,066
మధిర	36	146	6,072	3,416	7,710
వైరా	12	195	4,718	3,180	6,894
సత్తుపల్లి	23	102	4,810	3,526	8,509
మొత్తం	146	682	26,968	16,761	44,204

ఆడబిడ్డలకు కానుకగా చీరలు

- నా చేతుల మీదుగా ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నా..
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్


మహిళకు చీర అందజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: బతుకమ్మ పండుగను ఆడబిడ్డలందరూ ఘనంగా జరుపుకోవాలనే భావనతో రాష్ట్రప్రభుత్వం ఏటా చీరలు పంపిణీ చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం 27వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాల, 22వ డివిజన్ చర్చి కాంపౌండ్ కమ్యూనిటీ హాల్, ఎన్నెస్పీ క్యాంప్‌లోని డీపీఆర్సీ సమావేశ హాల్‌లో బుధవారం ఆయన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లాలో 4.27లక్షల మందికి చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహంగా జరుపుకునే పండుగకు ఆడబిడ్డలందరూ కొత్త చీరలు ధరించాలనే ఉద్దేశంతో గడచిన పదేళ్లుగా సీఎం కేసీఆర్ ఖర్చుకు వెనుకాడకుండా అందజేస్తున్నారని చెప్పారు. కాగా, మహిళలకు తన చేతుల మీదుగా చీరలు పంపిణీ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు.

నగరమంతటా సమగ్రాభివృద్ధి

ఖమ్మంలో ఏ ప్రాంతాన్నీ వదలకుండా సమగ్రాభివృద్ధి చేశామని, ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించామని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని 22, 25, 34, 46వ డివిజన్లలో వివిధ పనులకు శంకుస్థాపన చేశాక 23వ డివిజన్ ఎస్పీ ఆఫీస్ రోడ్డు వద్ద రూ.37లక్షల వ్యయంతో నిర్మించిన అంధుల పార్క్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే, పార్కులో లూయిస్ బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరించాక మంత్రి మాట్లాడారు. ఆతర్వాత భక్తరామదాసు కళాక్షేత్రంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు మంత్రి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కమర్తపు మురళి, గజ్జెల లక్ష్మి, సరస్వతి రవినాయక్, పగడాల శ్రీవిద్య నాగరాజు, కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, శీలంశెట్టి రమా వీరభద్రం, గోళ్ల చంద్రకళ, దొడ్డా నగేష్, మక్బూల్, పల్లా రోజ్‌లీనా, రుద్రగాని శ్రీదేవి, తోట ఉమ, డీఆర్డీఓ విద్యాచందన, కేఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, తహసీల్దార్ స్వామి, ఈఈ కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.


అంధుల పార్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

రూ.కోట్లాది నిధులతో అభివృద్ధి చేశా

రఘునాథపాలెం: నియోజకవర్గాన్ని రూ.కోట్లాది నిధులతో అభివృద్ధి చేశానని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని గణేశ్వరం, వేపకుంట్ల గ్రామాల్లో రూ.1.58 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. డీఆర్డీఓ విద్యాచందన, ఎంపీపీ భూక్యా గౌరి, ఎంపీడీఓ రామకృష్ణ, జలవనరుల శాఖ ఈఈ అనన్య, తహసీల్దార్ విల్సన్‌తో పాటు మెంటెం రామారావు, దారా శ్యాం, యాస నీలిమ, మద్దినేని వెంకటరమణ, పిన్ని కోటేశ్వరరావు, కుర్రా భాస్కర్‌రావు, ఉప్పెర్ల వనజ, కొండలరావు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు ఆరు కేంద్రాలు

- రైతులు ఆధార్ నంబర్ నమోదు చేయించుకోవాలి
- మార్కెటింగ్ శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో రైతుల నుంచి పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిద్ధమవుతోంది. ఈమేరకు వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కలెక్టరేట్‌లో బుధవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, సుమారు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈనెలలో మూడో వారం నుంచి పత్తి చేతికి రానుండగా, జిల్లాలోని ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, వైరా, ఏన్కూరు, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ల పరిధిలో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, జిన్నింగ్ మిల్లుల్లోనూ రైతులు నేరుగా విక్రయించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం తేమ శాతం ఆధారంగా పత్తి క్వింటాకు ప్రకటించిన రూ.7,020 మద్దతు ధర రైతులకు దక్కేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈక్రమాన అక్రమాలు జరగకుండా పత్తి సాగు చేసిన రైతులు తమ ఆధార్ నంబర్‌ను ఏఈఓలు, ఏఓల వద్ద నమోదు చేయించుకోవడంతో పాటు బ్యాంకు అకౌంట్‌కు అనుసంధానం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, మార్కెట్ల కార్యదర్శులు ఆర్.మల్లేశం, సంతోష్‌కుమార్, కె.చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీనివాసరావు, పి.వీరాంజనేయులుతో పాటు అరవింద్, అవినాష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వస్థలానికి చేరిన మలేషియా బాధితులు

సహకరించిన ఎస్‌ఐ సురేశ్‌కు సన్మానం


ఎస్‌ఐ సురేశ్‌ను సత్కరిస్తున్న ఎంపీటీసీ సామేలు, బాధితులు

ఎర్రుపాలెం: వర్క్ వీసాతో ఉపాధి కల్పిస్తామని కొందరు చెప్పిన మాటలు నమ్మి మలేషియా వెళ్లిన మండల వాసులు పలువురు అక్కడ చిక్కుకున్నారు. బాధితుల్లో ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, నారాయణపురం, జమలాపురం, అయ్యవారిగూడెం గ్రామాలకు చెందిన పలువురు ఉండగా, వర్క్ వీసా లేకపోవడంతో దాదాపు రూ.40వేల వరకు మలేషియాలో జరిమానా విధించారు. అయితే, బాధితుల వద్ద చిల్లిగవ్వ లేక అక్కడి తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డిని ఆశ్రయించారు. ఆయనతో రాజుపాలెం ఎంపీటీసీ దోమందుల సామేలు తదితరులు మాట్లాడగా ఎస్‌ఐ సురేశ్ కూడా చొరవ చూపడంతో బాధితులు ఇటీవల స్వస్థలానికి చేరారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ఎస్‌ఐ సురేశ్‌ను బుధవారం సత్కరించారు. ఎంపీటీసీ తదితరులు అందించిన సహకారం మరువలేనిదని వారు చెప్పారు. కార్యక్రమంలో స్వర్ణ నాగేశ్వరరావు, గుమ్మళ్ల రామారావు, గణపవరపు శ్రీను, స్వర్ణ తిరుపతమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే నా రాజకీయాలు

- తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించాలి
- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు అందిస్తున్న తుమ్మల, నాయకులు

ఖమ్మం రూరల్/కూసుమంచి: నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడు కూడా స్వలాభం చూసుకోకుండా ప్రజలు, అభివృద్ధి కోసమే పాటుపడ్డానని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లోని తల్లంపాడు, ముగినిగేపల్లిలో బుధవారం నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను అందజేశారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో తుమ్మల మాట్లాడుతూ ఏ పార్టీలో ఉన్నా చిత్తశుద్ధితో అభివృద్ధికి కృషిచేశానని తెలిపారు. కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వం తనను ఆహ్వానించడంతో మరోసారి ప్రజాసేవ చేయడానికి వచ్చానని.. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరముందని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను పాలేరు నియోజకవర్గానికి మళ్లించడం, జిల్లాలో 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని, అది నెరవేరాక రాజకీయాల నుండి తప్పుకుంటానని వెల్లడించారు. దానధర్మాలతో ప్రజలను బిక్షమెత్తుకునేలా చేయడం కాకుండా... అభివృద్ధి ద్వారా అందరూ బాగుపడి వారే పది మందికి సాయం చేసే స్థితికి చేరాలన్నదే తన కోరిక అని తుమ్మల చెప్పారు. బార్ల యజమానులు, కాంట్రాక్టర్లను పీడించే సంస్కృతి తనది కాదని... ప్రజలు ఈసారి తమ తప్పు తెలుసుకుని ఎలాంటి వారు కావాలో నిర్ణయించుకోవాలని కోరారు. తొలుత కేశ్వాపురంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తుమ్మల నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ బెల్లం శ్రీను, నాయకులు మట్టె గురవయ్య, సాధు రమేష్‌రెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, జూకూరి గోపాలరావు, ఎరసాని శివశంకర్‌రెడ్డి, కల్లెం వెంకటరెడ్డి, తేజావత్ పంతులునాయక్, రామసహాయం వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎండీ.హఫీజుద్దీన్, పోటు లెనిన్, మాదాసు ఉపేందర్, రామా శ్రీను, కొరివి వెంకటరత్నం, బండి జగదీష్, జంగం భాస్కర్, మద్ది వీరారెడ్డి, గుడిసె నాగేశ్వరరావు, బోజెడ్ల వెంకటయ్య, కుమ్మరి అంబేద్కర్, తేజావత్ ఎల్లయ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంతగుడి అభివృద్ధికి రూ.1.50 లక్షలు విరాళం



దాత వీరప్రతాప్‌ను సత్కరిస్తున్న ఎస్‌ఐ, తదితరులు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం (సంత గుడి) అభివృద్ధికి గ్రామానికి చెందిన మేదిరి టోనీ వీరప్రతాప్ తన తండ్రి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ.1.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చైర్మన్ అడ్డగోడ ఐలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్‌ఐ పి.రామారావు మాట్లాడారు. సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ యువత భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో తలారి చంద్రప్రకాశ్, ఎండీ.హనీఫ్, అజ్మీరా వీరన్న, యర్రా చక్రపాణి, నేదునూరి నరేశ్, యర్రా నరసింహారావుగుప్తా, సురేందర్ మనియార్, ఆదెర్ల రాములు, తాజుద్దీన్, ఆదెర్ల రామారావు, తొగర శ్రీను, పాక్కిలి యుగేందర్, రాములు, గణితి నారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



బి.ఝాన్సీరాణి

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం కోదాడ క్రాస్ రోడ్డులోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.ఝాన్సీరాణికి డాక్టరేట్ లభించింది. స్టాటిస్టిక్స్ విభాగంలో ఆమె సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు ఝాన్సీరాణిని అభినందించారు.

వీడియో కెమెరామెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంసహకారనగర్: జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్(వీడియో కెమెరామెన్) పోస్టును ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనుండగా, అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్/తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు ద్వారా సినిమాటోగ్రఫీలో డిప్లొమా లేదా తత్సమాన అర్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో కానీ జిల్లా వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు ఆర్టీసీ అమరవీరుల సంస్మరణ సభ

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీలో హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కార్మికులు 2019లో 55 రోజుల పాటు సమ్మె చేయగా, సమ్మె మొదలైన అక్టోబర్ 5వ తేదీని 'ఆర్టీసీ రక్షణ-కార్మికుల త్యాగదినం'గా నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు వెల్లడించారు. ఈసందర్భంగా గురువారం ఉదయం 9-30 గంటలకు ఖమ్మం డిపో వద్ద ఆర్టీసీ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. ఈసభకు కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పాఠశాలలో సీసీ కెమెరాలు ధ్వంసం

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. అలాగే, పాఠశాల ఆవరణలోని ట్యూబ్‌లైట్లను కూడా ధ్వంసం చేశారని హెచ్‌ఎం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.


వైరా రిజర్వాయర్‌లో మత్స్యకారుడి మృతి

కొణిజర్ల: చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు వైరా రిజర్వాయర్‌లో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వైరా మున్సిపాలిటీ 20వ వార్డుకు చెందిన భూక్యా రాములు (40) బుధవారం ఉదయం చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో తెప్పపై వెళ్తూ చేపల వల వేస్తుండగా ప్రమాదశాత్తు జారి పడడంతో నీట మునిగి చనిపోయాడు. మధ్యాహ్నం మృతదేహాన్ని గమనించిన జాలర్లు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ జె.శంకరరావు చేరుకుని మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

యువకుడిపై కత్తితో దాడి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రోటరీనగర్‌లో ఓ యువకుడిపై కొందరు కత్తితో దాడి చేయగా గాయాలయ్యాయి. రోటరీనగర్‌కు చెందిన గొరిశెట్టి వినోద్‌తో మాట్లాడే పని ఉందని బుధవారం పిలిచిన కొందరు యువకులు ఆయనను దూషిస్తూ కత్తితో దాడి చేసేందుకు యత్నించగా తప్పించుకునే క్రమంలో చెవి వద్ద గాయమైంది. ఆతర్వాత బండరాయితో కాలిపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై వినోద్ ఇచ్చిన ఫిర్యాదుతో గణేశ్, నరేందర్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

పోరులో మనమే గెలవాలి..

నేటి నుంచి వన్డే క్రికెట్ ప్రపంచ కప్ పోటీలు

- నెలన్నర రోజుల పాటు అభిమానులకు పండుగ
- బలమైన జట్లతో పోటీలు ఉత్కంఠగా సాగుతాయని అంచనా
- భారత్ మూడోమారు విజేతగా నిలవాలని ఆకాంక్ష



ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో క్రికెట్ సాధన చేస్తున్న క్రీడాకారులు



ఖమ్మంస్పోర్ట్స్: క్రీడలంటే అందరికీ మొదట గుర్తుకొచ్చేది క్రికెట్! రానురాను పరిస్థితిలో మార్పు వస్తున్నా క్రికెట్‌పై క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. క్రికెట్ వరల్డ్ కప్ టోర్నీ గురువారం మొదలుకానుండగా భారత జట్టువిజయం సాధించాలని క్రీడాకారులు ఆకాంక్షిస్తున్నారు. నెలన్నర పాటు జరిగే టోర్నీలో పది జట్లు పాల్గొంటున్నాయి. అయితే, టోర్నీకి వెస్టిండీస్ జట్టు క్వాలిఫై కాకపోవడాన్ని పలువురు జీర్ణించుకోలేకపోతున్నారు. కాగా, గురువారం నుంచి జరిగే మ్యాచ్‌లను టీవీల్లో చూసేందుకు అభిమానులు సిద్ధమయ్యారు. భారత జట్టులో ప్రపంచ స్థాయి ఆటగాళ్లు ఉండడమే కాక పోరు సొంత గడ్డపై జరుగుతుండటంతో బలమైన మద్దతు లభిస్తుందని భావిస్తున్నారు. మ్యాచ్‌లను ఎక్కువ మంది టీవీల్లో చూడనుండగా.. మూడు మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరగనుండటంతో పలువురు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా జిల్లాలోని క్రీడాకారులు, క్రికెట్ అభిమానులను పలకరించగా భారత జట్టు బలాబలాలు, టోర్నీలో విజయానికి ఉన్న అవకాశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

బ్యాట్స్‌మెన్‌పైనే భారం



భారత జట్టులో బ్యాట్స్‌మెన్లపైనే భారం పడుతుంది. విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్ ఈసారి సత్తా చాటుతారనే నమ్మకం ఉంది. బౌలర్లు బూమ్రా, సిరాజ్ విజయంలో పాలుపంచుకుంటారు. మన జట్టు ఫుల్ విన్నర్‌గా నిలిస్తే కప్ సాధించడం సులువవుతుంది.

–జోజివాకో, సీనియర్ క్రికెటర్, ఖమ్మం

ఆస్ట్రేలియా, పాక్ జట్లను నిలువరిస్తేనే



ముందుగా పాకిస్తాన్, ఆస్ట్రేలియా జట్లను నిలువరిస్తే భారత్‌కు విజయావకాశాలు మెండుగా ఉంటాయి. ఈ రెండింటితో మ్యాచ్‌లు ఉత్కంఠగా ఉంటాయి. మన ఆటగాళ్లు ఇటీవల వరుసగా విజయం సాధిస్తున్నందున అదే స్థాయిలో సత్తా చాటే అవకాశముంది.

–జి.వెంకటేశ్వరరావు, జాతీయ క్రికెటర్

స్పిన్నర్లదే కీలక పాత్ర



ఆట చివరి దశలో ఉన్నప్పుడు స్పిన్నర్లదే కీలక పాత్ర అవుతుంది. మ్యాచ్‌లు జరిగే పిచ్‌లన్నీ మన క్రికెటర్లు ఆడినవే కావడంతో భారత జట్టుకు అనుకూలించే అవకాశముంటుంది. జడేజా, కుల్దీప్ యాదవ్, అశ్విన్ బౌలింగ్‌లో రాణిస్తే మన జట్టుకు ఇక తిరుగు ఉండదనే చెప్పొచ్చు.

–డాక్టర్ బి.వెంకన్న, పీడీ, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కాలేజీ

మరోసారి కప్ మనదే..



జట్టు పటిష్టంగా ఉండడం, ఇటీవల జరిగిన మ్యాచ్‌ల్లో విజయం సాధించిన నేపథ్యాన వరల్డ్ కప్ మనమే గెలుస్తామనే నమ్మకం ఉంది. ప్రస్తుత ఆటతీరు ప్రదర్శిస్తే కష్టమేమీ కాదు. ప్రధానంగా భారత్‌లోనే అన్ని మ్యాచ్‌లు జరగనుండడం మనకు కలిసొస్తుంది.

–ఎం.డీ.మసూద్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోఆర్డినేటర్

పటిష్టమైన బౌలింగ్ దళం



మన జట్టు బ్యాట్స్‌మెన్ల ప్రతిభతో గతంలో గెలిచేది. కానీ ఇప్పుడు మంచి బౌలర్లూ ఉన్నారు. బూమ్రా, షమి, సిరాజ్ వంటి ఫాస్ట్ బౌలర్లు, ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యాతో పాటు అశ్విన్, కుల్దీప్‌యాదవ్, జడేజా వంటి స్పిన్నర్లు మన విజయంలో కీలకమవుతారు.

–సాదుల సారంగపాణి, ట్రాఫిక్ ఏసీపీ

విజయం మనదే కావాలి..



కపిల్‌దేవ్, మహేంద్రసింగ్ ధోని కప్ తీసుకొచ్చిన మాదిరిగా రోహిత్‌శర్మ సారథ్యాన మళ్లీ భారత్‌కే కప్ దక్కాలి. ఆడే ప్రతీ మ్యాచ్‌లో ఉత్తమ స్కోర్ సాధించేలా బ్యాట్స్‌మెన్, వికెట్లు పడగొట్టేందుకు బౌలర్లు దృష్టి సారిస్తే గెలిచినట్లే. మనమే ఈసారి కప్ గెలుస్తామని నమ్మకం ఉంది.

–డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్

లీగ్ దశలో పాయింట్లతో గెలుపు



లీగ్‌ల్లో అన్ని మ్యాచ్‌లను గెలిచేలా ప్రణాళికలు రచించుకోవాలి. లీగ్ మ్యాచ్‌ల్లో విజయ ఢంకా మోగిస్తే కప్ గెలవడం ఖాయమే. మన జట్టులో ఉన్న ఐదుగురు బ్యాట్స్‌మెన్లు ఒక ఆల్‌రౌండర్ పూర్తిగా సత్తా చాటితే మన జట్టుకు విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి.

–టి.సునీల్ రెడ్డి, డీవైఎస్ఓ, ఖమ్మం

బౌలర్లకు దీటైన సమాధానం చెప్పాలి



భారత బ్యాట్స్‌మెన్లు ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక జట్లలోని బౌలర్లకు దీటైన సమాధానం చెప్పాలి. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. వీటితో మ్యాచ్‌ల్లో అత్యధిక స్కోరు సాధించాలి. బ్యాట్స్‌మెన్లు నిలకడగా ఆడి ఉత్తమ మైన స్కోర్ సాధిస్తే విజయావకాశాలు మెరుగవుతాయి.

–ఎం.డీ మతిన్, క్రికెట్ కోచ్

జట్టు కూర్పు బాగుంది..



ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టు కూర్పు బాగుంది. బ్యాట్స్‌మెన్‌లు, ఫాస్ట్ బౌలర్లు స్పిన్నర్లు, ఆల్ రౌండర్లతో కూడిన జట్టు పటిష్టంగా ఉంది. సొంత మైదానాల్లో మ్యాచ్‌లు జరగనుండడంతో అదనంగా కలిసొచ్చే అంశం. బ్యాట్స్‌మెన్‌లు రాణిస్తే విజయం మనదేనని చెప్పాలి.

–సాయిమోహన్, క్రికెట్ అభిమాని, ఖమ్మం

మల్లవరం.. మళ్లీ ముందంజ

- ఒకే గ్రామం నుంచి కానిస్టేబుళ్లుగా 13 మంది
- గతంలోనూ ఓసారి 17 మంది ఎంపిక



వెలగాల పూర్ణ చందర్‌రావు | భీమన బోయిన శివ | చావలి కనకరాజు

తల్లాడ: తల్లాడ మండలం మల్లవరం గ్రామ యువకులు కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్షల్లో సత్తా చాటారు. కానిస్టేబుల్ ఉద్యోగాల తుది ఫలితాలను బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా మల్లవరం నుంచి ఏకంగా 13మంది ఎంపికవడం విశేషం. ఎక్సైజ్ విభాగంలో కటికి ఉపేందర్, జవ్వాజి నరేష్, సివిల్‌లో కుంచం సైదులు, చాపల శ్రీకాంత్, ఏఆర్ విభాగంలో తుటారి తిరుపతరావు, కటికి ప్రవళిక, టీఎస్ఎస్‌పీ విభాగంలో చాపల రవీందర్, దుగ్గిదేవర వంశీ, చాపల పవార్, ఎర్రి లక్ష్మణ్‌రావు, మేడి శ్రీహరి, మేడి వరుణ్, టీఎస్ఎస్‌పీఎఫ్‌లో కోలేటి రాంమోహన్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గతంలో ఓసారి మల్లవరం నుంచి 17 మంది ఎంపిక కావడంతో వీరిని స్ఫూర్తిగా తీసుకున్న మరికొందరు యువకులు ఈసారి సత్తా చాటారు. అలాగే, మండలంలోని అన్నారుగూడెంకు చెందిన గొర్ల చిన్న వెంకటి, కొత్తపల్లి చక్రవర్తి, మంగాపురానికి చెందిన గాదె సాయికృష్ణ, కుంచం కృష్ణ, కుర్నవల్లికి చెందిన బొగ్గుల నర్సిరెడ్డి సైతం చొప్పున ఎంపికయ్యారు. కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకులను పలువురు అభినందించారు,

నాగవరప్పాడు నుంచి ముగ్గురు...

మధిర: మధిర మండలం నాగవరప్పాడుకు చెందిన ముగ్గురు యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన వెలగాల పూర్ణచంద్రరావు, భీమనబోయిన శివ, చావలి కనకరాజు కానిస్టేబుళ్లుగా ఎంపిక కాగా, సర్పంచ్ మోరు బోయిన నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు తోక రాజరాజేశ్వరి తదితరులు అభినందించారు. వీరిలో పూర్ణచంద్రరావు ఉస్మానియాలో డబుల్ పీజీ చేయగా, అదే యూనివర్సిటీలో చావలి కనకరాజు ఎమ్మెస్సీ పూర్తిచేశాడు. ఇక శివ బీటెక్ పూర్తి చేశాక హైదరాబాద్‌లో ఉంటూ శిక్షణ తీసుకుని కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా అయ్యప్పరెడ్డి



అయ్యప్పరెడ్డి

సత్తుపల్లి టౌన్: కానిస్టేబుల్ ఫలితాల్లో సత్తుపల్లి తుమ్మూరు రామారావు వీధికి చెందిన తలుపురెడ్డి అయ్యప్పరెడ్డి ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. చెన్నారెడ్డి – పద్మ దంపతుల పెద్దకుమారుడు అయ్యప్పరెడ్డి పీజీ పూర్తి చేశాక పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈక్రమంలోనే ఆయన ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

ఈర్లపూడి నుంచి..

రఘునాథపాలెం: మండలంలోని పెద్ద ఈర్లపూడి గ్రామానికి చెందిన ఎస్.కే.మాజిద్‌పాషా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మార్కెట్ వైస్‌చైర్మన్ అఫ్జల్ తమ్ముడి కుమారుడైన ఆయన ఉద్యోగానికి ఎంపిక కాగా పలువురు అభినందించారు.

రైతులు బలోపేతం కావాలనే పథకాలు

- ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, ఎమ్మెల్సీ మధు
- ఘనంగా వైరా మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ చైర్మన్ మోహన్‌రావు

వైరా: రైతులు బలోపేతం కావాలనే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను ప్రవేశపెట్టారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ తెలిపారు. వైరాలోని మార్కెట్ కార్యాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటుచేయగా ఎమ్మెల్సీ మధుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కలలను సీఎం కేసీఆర్ ఆదర్శంగా తీసుకుని పాలన సాగిస్తున్నారన్నారు. కేసీఆర్ లక్ష్యాలు సాధించాలంటే వచ్చే ఎన్నికల్లోనూ గెలిపించాలని కోరారు. వేదికపై ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌ను పెండ్లి కొడుకుగా సంబోధిస్తూ శిలాఫలకాలపై కాకుండా ప్రజల మనోఫలకాలపై పేర్లు ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మధు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మదన్‌లాల్‌ను గెలిపించి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. ఒకసారి అవకాశం ఇవ్వాలని వచ్చే వారిని నమ్మొద్దని సూచించారు. తొలుత మార్కెట్ చైర్మన్‌గా పసుపులేటి మోహన్‌రావు, వైస్ చైర్మన్‌గా ధూపాటి భద్రరాజుతో జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్ ప్రమాణ స్వీకారం చేయించారు. విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, ఎంపీపీలు వేల్పుల పావని, శ్రీనివాసరావు, జెడ్పీటీసీలు కనకదుర్గ, కవిత, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములుతో పాటు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, కట్టా కృష్ణార్జున్ రావు, లాల్‌అహ్మద్ తదితరులున్నారు.



వైరాలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

కేసీఆర్ నాయకత్వంలోనే బంగారు తెలంగాణ

సీఎం కేసీఆర్ నాయకత్వంలో బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు, 'సుడా'నిధులు రూ.కోటి వైరా రింగ్‌రోడ్డు నుంచి రిజర్వాయర్ వరకు చేపట్టే రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములు, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, మున్సిపల్ కమిషనర్ పఠాని వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావుతో పాటు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, బొంతు రాంబాబు, దారెల్లి కోటయ్య, దారెల్లి పవిత్రకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు

చింతకాని: మండలంలోని కొదుమూరుకు చెందిన నిమ్మకంటి రమేశ్‌బాబుపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఆయన తన భార్య శివపార్వతిని కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేందర్ వెల్లడించారు.

ఇళ్ల పంపిణీపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలి



మాట్లాడుతున్న నజీమా

ఖమ్మంరాపర్తినగర్: ఉమ్మడి జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగిన నేపథ్యాన అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ షేక్ నజీమా, కోకన్వీనర్ జి.నరేంద్ర డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మం వైఎస్సార్‌కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితా నుంచి ఎనిమిది మంది అర్హులను తొలగించారని పేర్కొన్నారు. అలాగే, కొత్తగూడెం పీవీకే-5 గని విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇంకోచోట ఇళ్ల పట్టాలు ఇవ్వగా అవకతవకలు జరిగాయని తెలిపారు. ఈ విషయమై అధికారులు విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బానోతు భద్రునాయక్, మట్టి ప్రసాద్, వీరన్ననాయక్, నాగేంద్రనాయక్, ఉపేంద్ర బాయి, రవీంద్రనాయక్, శ్రీనివాస్‌నాయక్, జంగిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కోసమే సైకిల్‌యాత్ర



ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్తున్న బోస్

ఖమ్మంమయూరిసెంటర్: భారత రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన సుభాష్ చంద్ర బోస్ చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం ఖమ్మం చేరుకుంది. రుద్రవరం గ్రామానికి చెందిన ఆయన ఈ ఏడాది సెప్టెంబర్ 2న యాత్ర ప్రారంభించారు. దేశంలోని 30రాష్ట్రాలు, ఎనిమి ది కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 50 వేల కి.మీ.మేర 2025 ఆగస్టు వరకు యాత్ర చేపట్టను న్నట్లు ఆయన తెలిపారు. రోజుకు 80 కి.మీ. మేర వెళ్తూ రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. చిన్నప్పుడే తండ్రి చనిపోగా, తల్లి, అన్నయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నట్లు వెల్లడించారు. సొంత డబ్బు తో పాటు కొందరు స్నేహితులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సీఐ శ్రీనివాస్‌చౌదరి ఆర్థిక సాయంతో యాత్ర చేపడుతున్నాన ని వివరించారు. కాగా, ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్తున్న బోస్‌ను పలువురు అభినందించి ఆర్థికసాయం అందజేశారు.

లక్ష్యం మేరకు సీఎంఆర్ అందించాలి

కల్లూరు: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు గడువులోగా సీఎంఆర్ సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించా రు. కల్లూరులోని రైస్ మిల్లులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైస్ మిల్లులకు సరఫరా చేసిన ధాన్యాన్ని మర ఆడించి అందించాలని పేర్కొన్నారు. తనిఖీల్లో పౌర సరఫరాల శాఖ డీటీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఖో-ఖో బాలుర జట్టు ఎంపిక

కల్లూరు: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అండర్-17 బాలుర ఖో-ఖో జట్టును బుధవారం ఎంపిక చేశారు. కల్లూరులో జరిగిన ఎంపిక పోటీలకు 165 మంది క్రీడాకారులు హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన 15 మంది జట్టు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ జట్టు వనపర్తి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు. ఎంపిక పోటీలను డీఈఓ సోమశేఖర్‌శర్మ ప్రారంభించగా ఎంఈఓ దామోదర ప్రసాద్, హెచ్‌ఎం పత్తిపాటి నివేదితతో పాటు నర్సింహమూర్తి, సత్యనారాయణరెడ్డి, పసుపులేటి వీరరాఘవయ్య, పి.నరసయ్య, కె.రాధాకృష్ణ, రామారావు, ఎ.కృష్ణపవన్, కవిత, కె.విజయ కుమారి పాల్గొన్నారు.

హత్య కేసు కొట్టివేత

ఖమ్మంలీగల్: మద్యంలో విషం కలపడం వల్లే వ్యక్తి మరణించాడంటూ నమోదైన కేసును బుధవారం ఖమ్మం మొదటి అదనపు జిల్లా కోర్టు కొట్టివేసింది. వివరాలిలా ఉన్నాయి. 2014 సెప్టెంబర్ 22న ఖమ్మం మయూరిసెంటర్‌లోని ఓ బార్‌లో మంగళగూడెం గ్రామానికి చెందిన గంటల వెంకటేశ్వర్లు మద్యం తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఆయనకు చికిత్స చేయిస్తుండగా మృతి చెందడంతో భార్య ప్రమీల, ఆమె సోదరుడు వెంకట్రామయ్యతో పాటు చాంద్‌పాషా మద్యంలో విషం కలపడం వల్లే వెంకటేశ్వర్లు మరణించాడని తమ్ముడు సురేష్ ఫిర్యాదు చేయగా ఖమ్మం టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంటూ బుధవారం కేసును కొట్టేశారు. కాగా, నిందితుల తరఫున దొండపాటి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు.

వైద్యం వికటించి మహిళ మృతి?

ఖమ్మంవైద్యవిభాగం: చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన మహిళ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. తిరుమలాయపాలెం మండలం జల్లెపల్లికి చెందిన అంగన్‌వాడీ ఆయా కొమర ఎల్లమ్మ (40)కు నీరసంగా ఉండటంతో ఖమ్మం నెహ్రూనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. ఒంట్లో నీరసంగా ఉందని చెప్పగా వైద్యులు ఆమెకు రక్తం ఎక్కించారు. ఆ తర్వాత కాసేపటికే పరిస్థితి విషమించి ఎల్లమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బంధువులు ఆస్పత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఒంట్లో నీరసంగా ఉందని వస్తే అవసరం లేకపోయినా రక్తం ఎక్కించారని, వైద్యుల నిర్లక్ష్యమే ఆమె మృతికి కారణమని ఆరోపిస్తూ బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు పీఆర్‌టీయూ ధర్నా



మాట్లాడుతున్న మోత్కూరి మధు

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలనే డిమాండ్‌తో గురువారం ధర్నా నిర్వహించనున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోతుకూరి మధు, రామిశెట్టి రంగారావు తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయం వద్ద బుధవారం వారు మాట్లాడారు. నగరంలోని ధర్నాచౌక్‌లో సాయంత్రం నాలుగు గంటలకు నిరసన మొదలవుతుందని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో యలమద్ది వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, రవికుమార్, శాంతబాబు, కిరణ్‌కుమార్, సాధు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో శిశువు మృతి

ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శిశువు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని గొల్లచర్లకు చెందిన శిరీషను కాన్పు కోసం ఖమ్మం నెహ్రూనగర్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో బంధువులు చేర్పించారు. వైద్యులు కాన్పు చేయగా కవల పిల్లలు జన్మించారు. వీరిలో ఒకరి బరువు తక్కువగా ఉందని వెల్లడించిన వైద్యులు ఇంక్యూబేటర్ బాక్స్‌లో ఉంచి చికిత్స ప్రారంభించారు. మరో శిశువుకు వైద్యం చేసేందుకు రూ.లక్ష కట్టాలని చెప్పగా బంధువులు చెల్లించారు. ఆ తర్వాత ఒక శిశువు మృతి చెందడంతో ఆగ్రహించిన బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు చేరుకుని చర్చించగా, బంధువులు వెనక్కి తగ్గకపోవడంతో ఆస్పత్రి యాజమాన్య బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్యాభర్తల గొడవలో బావమరిదికి గాయాలు

పెనుబల్లి: దంపతుల మధ్య గొడవను అడ్డుకోబోయిన బావమరిదిపై బావ కత్తితో దాడికి పాల్పడగా తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని లంకపల్లికి చెందిన వెంకటరమణ తన భర్త కిశోర్‌తో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో ఇటీవల భార్య వెంకటరమణ లంకపల్లిలో పుట్టింటికి వచ్చింది. ఆ తర్వాత కిశోర్ కూడా రాగా, మంగళవారం రాత్రి భార్యతో గొడవపడ్డాడు. దీంతో వెంకటరమణకు సోదరుడి వరుస అయ్యే సాయి అడ్డుకోబోయాడు. దీంతో కోపోద్రోక్తుడైన కిశోర్ ఆయనపై కత్తితో దాడికి చేయగా తీవ్ర గాయాలు కాగా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కిశోర్‌కు స్థానికులు దేహశుద్ధి చేయగా గాయపడ్డాడు. ఆయనకు పెనుబల్లిలో ప్రాథమిక చికిత్స చేసి, ఖమ్మం తీసుకెళ్లారు.

సాక్షి బిజినెస్
గురువారం
5-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
286	93
65,226	19,436

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,154	△	95
డోజోన్స్	32,975	▽	27
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,412	▽	58
డాక్స్	15,100	△	15
షాంఘై (గురువారం ముగింపు)	3,110	△	3
నికాయ్	30,527	▽	711

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,653	▽	22
బంగారం (99.5 స్వచ్ఛత)	56,426	▽	22
వెండి (కేజీ)	67,446	△	409

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.87	102.21
€	యూరో	ఎస్‌బీఐ	85.63	88.70
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.95	56.65
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.46	53.74
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.65	61.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.25

సూపర్‌డ్రైతో రిలయన్స్ జత

- 24:76 శాతం వాటాతో జేవీ ఏర్పాటు
- దక్షిణాసియా ఐపీ ఆస్తుల కొనుగోలు

న్యూఢిల్లీ: దక్షిణాసియా మేధో హక్కుల(ఐపీ ఆస్తులు) విక్రయానికి రిలయన్స్ రిటైల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూకే ఫ్యాషన్ రిటైలర్ సూపర్‌డ్రై తాజాగా పేర్కొంది. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ) ద్వారా రిలయన్స్ రిటైల్ 4 కోట్ల పౌండ్లు(రూ. 402 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా స్వెట్‌షర్టులు, హుడీస్, జాకెట్స్ తదితర ఫ్యాషన్ ప్రొడక్టులను రూపొందిస్తున్న సూపర్‌డ్రై.. జేవీలో 24 శాతం వాటాను పొందనుంది. మిగిలిన 76 శాతం వాటా రిలయన్స్ రిటైల్ చేతిలో ఉంటుంది. ఒప్పందం ప్రకారం సూపర్‌డ్రై బ్రాండ్ ఐపీ ఆస్తులు కొత్తగా ఏర్పాటు చేయనున్న జేవీకి శాశ్వతంగా బదిలీకానున్నాయి. రిలయన్స్ బ్రాండ్స్ హోల్డింగ్ యూకేతో ఐపీ జేవీ ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సూపర్‌డ్రై పీఎల్‌సీ.. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. తద్వారా భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో సూపర్‌డ్రై బ్రాండుసహా.. సంబంధిత ట్రేడ్‌మార్క్‌లను జేవీకి బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది.

నిధుల ఆవశ్యకత: సూపర్‌డ్రై ఇటీవల హోల్‌సేల్ కస్టమర్ల నుంచి బలహీన ఆర్డర్ల కారణంగా స్టాక్ నిల్వలు, లిక్విడిటీ తదితర అంశాలలో సవాళ్లు ఎదుర్కొంటోంది. దీంతో జేవీకి తెరతీసింది. దీంతో స్థూలంగా 3.04 కోట్ల పౌండ్ల నగదు లభించనుందని అంచనా వేస్తోంది. కాగా.. తాజా ఒప్పందంతో రిలయన్స్ దక్షిణాసియాలోని మూడు దేశాలలో కార్యకలాపాలు చేపట్టనున్నట్లు సూపర్‌డ్రై తెలియజేసింది. జేవీలో సూపర్‌డ్రై వాటాను కొనసాగించడంతోపాటు.. తమ నైపుణ్యం ద్వారా బ్రాండ్ డెవలప్‌మెంట్, డిజైన్, మార్కెటింగ్‌లలో మద్దతిస్తుందని రిలయన్స్ బ్రాండ్స్ ఎండీ దర్శన్ మెహతా చెప్పారు. భారత్ భారీ అవకాశాల మార్కెట్‌కాగా.. రిలయన్స్‌తో పటిష్ట బంధమున్నట్లు సూపర్‌డ్రై వ్యవస్థాపకుడు, సీఈవో జూలియన్ డంకెర్టన్ పేర్కొన్నారు.

2035 నాటికి ట్రిలియన్ డాలర్లు

- భారత వాహన రంగంపై అంచనా
- ఆర్థర్ డి లిటిల్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం 2035 నాటికి ఎగుమతి ఆధారిత ట్రిలియన్ డాలర్ పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉందని ఆర్థర్ డి లిటిల్ నివేదిక పేర్కొంది. తయారీ, ఆవిష్కరణలు, సాంకేతికత తోడుగా పరిశ్రమ ఈ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది. 'భారత వాహన పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్లకు డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తికి ఆకర్షణీయ ప్రపంచ కేంద్రంగా మారవచ్చు. దీనిని సాధించడానికి ఈ రంగంలోని కంపెనీలు ప్రపంచ తయారీకి అనుగుణంగా తమ సామర్థ్యాలను విశ్వసనీయ, పోటీతత్వంగా మెరుగుపర్చుకోవాలి. జోనల్ ఆర్కిటెక్చర్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటి కొత్త సాంకేతికతలకు అనుగుణంగా పరిష్కారాలను అందించడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ పరిశోధన, అభివృద్ధిలో భారత శక్తి సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. నిధులతో కూడిన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థతో భారతదేశం వాహన రంగంలో నాయకత్వ స్థానంలో ఉండగల సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని వివరించింది.



నాయకత్వ స్థానంగా..: దేశీ వాహన రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణల వేగాన్ని, మారుతున్న సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించినట్లయితే భారతదేశాన్ని ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో నాయకత్వ స్థానంగా మార్చవచ్చని నివేదిక తెలిపింది. 'ప్రపంచవ్యాప్తంగా ఆటోమోటివ్ పరిశోధన, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు వృద్ధి చెంది 400 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశం ప్రపంచ సాఫ్ట్‌వేర్ హబ్‌గా, ఆఫ్‌షోర్ గమ్యస్థానంగా తన స్థానాన్ని ఉపయోగించుకోవచ్చు. భారత వాహన పరిశ్రమ నిజమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వంతో సహా ముడిపడి ఉన్న భాగస్వాముల మధ్య బలమైన చర్చలు, సమిష్టి చర్యలు అవసరం' అని నివేదిక వివరించింది.

నెల కనిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ ప్రతికూల సంకేతాలు
- ఎఫ్ఐఐల వరుస విక్రయాల ప్రభావం

ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం కొనసాగడంతో స్టాక్ మార్కెట్ రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 286 పాయింట్లు పతనమై 65,226 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు క్షీణించి 19,436 వద్ద నిలిచింది. రెండు సూచీలకు ముగింపు స్థాయిలు నెల కనిష్టం. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తత వహించారు. స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు పెద్ద ఎత్తున నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 633 పాయింట్లు నష్టపోయి 65 వేల స్థాయి దిగువన 64,879 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు పతనమై 19,334 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. విదేశీ



ఇన్వెస్టర్లు రూ.4,424 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,769 కోట్ల షేర్లను కొన్నారు.

- అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3% పెరిగి రూ.2464 వద్ద స్థిరపడింది. అబుదాబీ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హోల్డింగ్(ఐహెచ్‌సీ) ఓపెన్ మార్కెట్ కొనుగోళ్ల ద్వారా ఆదానీలో తన వాటాను 4.98% నుంచి 5.04 శాతానికి పెంచుకోవడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- అప్‌డేటర్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.300)తో 0.03 స్వల్ప డిస్కౌంట్‌తో 299.90 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 6% క్షీణించి రూ.282 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చింది. చివరికి 5.38% నష్టంతో 284 వద్ద నిలిచింది.

షెల్ డీజిల్ లీటర్ 20 పెంపు

లీటర్ విక్రయ ధర రూ.130

న్యూఢిల్లీ: షెల్ ఇండియా తన అవుట్‌లెట్ల ద్వారా విక్రయించే డీజిల్ ధరను లీటర్‌పై రూ.20 పెంచుతున్నట్లు ప్రకటించింది. వారం లోపే రెండో విడత ధరలను పెంచింది. దేశంలో అధిక వాటా కలిగిన ప్రభుత్వరంగ సంస్థలు మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా అవే రేట్లను కొనసాగిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు విక్రయ ధరల్లో ఎలాంటి సవరణలు చేయకపోవడం గమనించొచ్చు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మే నెలలో 75 డాలర్లలోపు ఉంటే, ప్రస్తుతం 95 డాలర్లపైకి చేరుకోవడం తెలిసిందే. షెల్ ఇండియా గత వారం కూడా లీటర్ డీజిల్‌పై రూ.4 చొప్పున పెంచింది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 346 పెట్రోల్ స్టేషన్లు ఉన్నాయి. ముంబైలో లీటర్ డీజిల్‌ను రూ.130కు, చెన్నైలో రూ.129 చొప్పున విక్రయిస్తోంది. పెట్రోల్ లీటర్ ధర రూ.117–118గా ఉంది. అదే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు లీటర్ డీజిల్‌ను రూ.95, లీటర్ పెట్రోల్ ధరను రూ.107 స్థాయిలో విక్రయిస్తుండడం గమనార్హం. ప్రాంతాలను బట్టి ఈ రేట్లలో స్వల్ప మార్పులు ఉంటాయి.



వరల్డ్ కప్ మ్యాచ్‌లకు స్పాన్సర్ల క్యూ..

- 26 స్పాన్సర్లు, 500 పైగా అడ్వర్టైజర్లు
- లిస్టులో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా
- డిస్నీ స్టార్ వెల్లడి

న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభమవుతున్న ఐసీసీ వరల్డ్ కప్ 2023 మ్యాచ్‌లను స్పాన్సర్ చేసేందుకు కంపెనీలు భారీ ఎత్తున క్యూ కడుతున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 26 స్పాన్సర్లు, 500 ప్రకటనకర్తలు నమోదు చేసుకున్నట్లు టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మ్యాచ్‌ల ప్రసార హక్కులను దక్కించుకున్న డిస్నీ స్టార్ స్పోర్ట్స్ విభాగం హెడ్ సంజోగ్ గుప్తా తెలిపారు. వీటిలో చాలా స్పాన్సర్లు టీవీ, డిజిటల్ ఫార్మాట్లను ఎంచుకోగా, కొన్ని కంపెనీలు కేవలం డిజిటల్ లేదా టీవీని మాత్రమే ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో భాగంగా నిర్వహించే 48 మ్యాచ్‌లను డిస్నీ స్టార్ తమ టీవీ చానళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం చేయనుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లు తొమ్మిది భాషల్లో 100 పైచిలుకు కామెంటేటర్స్‌తో డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానున్నాయి. వీటిలో తెలుగు, తమిళం తదితర భాషలు కూడా ఉన్నాయి. పన్నెండేళ్ల తర్వాత వరల్డ్ కప్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమిస్తోంది.



భారత్‌పై అంచనాలు.. పండుగ సీజన్ దన్ను

ఆసియా కప్‌లో భారత మెరుగైన పనితీరు, పండుగ సీజన్, భారత్ టీమ్‌పై భారీ అంచనాలు తదితర సానుకూలాంశాల కారణంగా అడ్వర్టైజర్లు భారీగా ఆసక్తి చూపుతున్నట్లు గుప్తా చెప్పారు. అన్ని కేటగిరీల కంపెనీలూ స్పాన్సర్ చేసేందుకు లేదా ప్రకటనలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. సాధారణంగా పండుగ సీజన్‌లో కంపెనీలు ప్రకటనలపై భారీగా వెచ్చిస్తుంటాయని తెలిపారు. స్పాన్సర్ల జాబితాలో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా అండ్ మహీంద్రా, డ్రీమ్11, హెచ్‌యూఎల్, హావెల్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పెర్నాడ్ ఇండియా, బుకింగ్ డాట్‌కామ్, పీటర్ ఇంగ్లాండ్, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, మాండెలీజ్, ఎమిరేట్స్, డయా జియో, ఎంఆర్ఎఫ్, లెండింగ్‌కార్ట్, బీపీసీఎల్, హెర్బాలైఫ్, హయర్, యాంఫీ, గూగుల్ పే, పాలీక్యాబ్, అమూల్, విడా, అమెజాన్ మొదలైన సంస్థలు న్నాయి. కోకా–కోలా, ఫోన్‌పే, హెచ్‌యూఎల్ వంటి పలు కంపెనీలు ఇటు టీవీ, అటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ స్పాన్సర్ చేస్తున్నాయి.

అనువైన ప్యాకేజీలు..

ప్రకటనకర్తల బడ్జెట్, అవసరాలను బట్టి వారికి అనువైన ప్యాకేజీలను రూపొందించినట్లు గుప్తా చెప్పారు. 'పండుగ సీజన్ సందర్భంగా.. ఎవరైనా అడ్వర్టైజరు దీపావళి సమయంలో ఎక్కువ మంది కస్టమర్లు తమ ఉత్పత్తులపై మక్కువ చూపుతారనే ఉద్దేశంతో పండుగకి ముందు ఓ రెండు వారాలపాటు ప్రకటనలు ఇవ్వదల్చుకున్నారనుకుందాం. కాస్త ప్రీమియం చెల్లించి ఆ వ్యవధిలో మాత్రమే తమ ప్రకటనలను ప్రసారం చేసుకునేందుకు వీలు కల్పించేలా వారికోసం కస్టమైజ్డ్ ప్యాకేజీని అందిస్తున్నాం' అని తెలిపారు. వరల్డ్ కప్‌లో మరింత మంది ప్రకటనకర్తలు భాగమయ్యేందుకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ''సెల్ఫ్–సర్వ్ ఫ్రేమ్‌వర్క్'ను ప్రవేశపెట్టినట్లు గుప్తా తెలిపారు. ఏజెన్సీలు, అడ్వర్టైజర్లు సేల్స్ టీమ్స్ జోక్యం లేకుండా, తమకు అవసరమైన వాటిని స్వయంగా బుక్ చేసుకునే వీలుంటుందని వివరించారు.

ఇంటి వద్దకే ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు

మొబైల్ డివైజ్‌లతో సర్వీసుల ఆవిష్కరణ

ముంబై: అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి చేర్చే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే, చేతిలో ఇమిడిపోయే మొబైల్ హ్యాండ్‌హెల్డ్ పరికరాల ద్వారా కూడా సేవలు అందించే విధానాన్ని ఆవిష్కరించింది. నేరుగా ఖాతాదారుల ఇంటి ముంగిట్లోకే కియోస్క్ బ్యాంకింగ్ సర్వీసులను తీసుకెళ్లేందుకు ఈ విధానం ఉపయోగపడగలదని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఖాతాదారులు మొదలైన వారికి ఇంటి దగ్గరే బ్యాంకింగ్ సర్వీసులు అందించడంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్లకు వీటితో వెసులుబాటు లభిస్తుందన్నారు. నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్లు, ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్స్ వంటి అయిదు రకాల సర్వీసులు ఈ విధానంలో అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు అకౌంటు తెరవడం వంటి ఇతర సేవలను కూడా చేర్చే యోచనలో ఎస్‌బీఐ ఉంది.



విద్య, ఉద్యోగ సమాచారం

నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

కేంద్ర విద్యాశాఖ దేశవ్యాప్తంగా 650 జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో పదకొండో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ(లేటరల్ ఎంట్రీ)కి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
» **వయసు:** 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించి ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాతపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు(ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్)ఉంటాయి. మొత్తం 100ప్రశ్నలు –100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికేట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీనితోపాటు అభ్యర్థి ఫోటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 10.02.2024.
» **వెబ్‌సైట్:** navodaya.gov.in

ఐవోసీఎల్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐవోసీఎల్ రీజియన్‌లలో గేట్–2024 ద్వారా గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్–2024 అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్ 2024 స్కోరు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గేట్ 2024 ఫలితాలు వెల్లడి తర్వాత ఐవోసీఎల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.iocl.com

ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో 68 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఫిజిసిస్ట్–02, క్లినికల్ సైకాలజిస్ట్–01, మెడికల్ ఆఫీసర్(ఆయుష్) –01, యోగా ఇన్‌స్ట్రక్టర్–01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–02, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్–04, స్టోర్ కీపర్–04, జూనియర్ ఇంజనీర్–03, జూనియర్ ఫిజియోథెరపిస్ట్–01, జూనియర్ ఆడియాలజిస్ట్/స్పీచ్ థెరపిస్ట్–02, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–01, ఆప్టోమెట్రిస్ట్–02, టెక్నీషియన్(ల్యాబొరేటరీ)–16, టెక్నీషియన్(రేడియాలజీ)–02, ఫార్మసిస్ట్–05, ఫైర్ టెక్నీషియన్–02, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్‌లు–02, స్టెనోగ్రాఫర్–04, లాండ్రీ సూపర్‌వైజర్–01, జూనియర్ వార్డెన్–02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్–10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2/డిగ్రీ/ఎంబీఏ /ఎంఎస్సీ/పీజీ డిగ్రీ/ఎంఏ/పీజీ డిప్లొమా/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ టెస్ట్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in

కాళోజీ వర్శిటీలో ఎంపీటీ ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీటీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు.
» **అర్హత:** బీపీటీ డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 30.09.2023లోపు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2023
» **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

బోధన, పరిశోధనకు.. నెట్

బోధన, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి మార్గం.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! సంక్షిప్తంగా.. యూజీసీ నెట్! ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. రీసెర్చ్‌కు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్ పొందొచ్చు. మరో వైపు బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులూ దక్కించుకోవచ్చు. యూజీసీ-నెట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా యూజీసీ నెట్-డిసెంబర్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ-నెట్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

» యూజీసీ నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల
» డిసెంబర్ 6 నుంచి 22 వరకు పలు స్లాట్లలో పరీక్షలు
» నెట్‌లో ఉత్తీర్ణతతో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత
» 80కు పైగా సబ్జెక్ట్‌లలో నెట్ నిర్వహణ

సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో పరిశోధనలకు మార్గాలు అనేకం. కానీ హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో మాత్రం ఆశించిన మేరకు రీసెర్చ్ అవకాశాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారంగా అందుబాటులోకి తెచ్చిన విధానమే.. యూజీసీ–నెట్. దీనిద్వారా సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధన అవకాశాలు అందుకోవచ్చు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలనుకునే వారికి యూజీసీ–నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

83 సబ్జెక్టుల్లో నెట్

యూజీసీ నెట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా 2023 డిసెంబర్ సెషన్‌కు సంబంధించి ప్రకటన ఇచ్చింది. 83 సబ్జెక్ట్‌లలో డిసెంబర్ 6 నుంచి 22 వరకు పరీక్షలను నిర్వహించనుంది. దీని ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రెండు కేటగిరీలుగా

- యూజీసీ–నెట్‌ను సాధారణంగా రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అవి.. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరు కావాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- రీసెర్చ్/జేఆర్ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితమవ్వాలనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లలో పరీక్ష

- యూజీసీ నెట్‌ను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్–1.. 50 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇందులో టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, భిన్నమైన ఆలోచన సరళిపై ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2.. 100 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇది అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ పేపర్. ఇందులో అభ్యర్థుల డొమైన్ నాలెడ్జ్ పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన లేదు.

పేపర్ ఎంపిక ఎలా



- అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ..పేపర్–1కు తప్పనిసరిగా హాజరు కావాలి.
- అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పరీక్ష పేపర్ 2. ఉదాహరణకు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు ఎకనామిక్స్ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే.. కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్–ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

సబ్జెక్ట్‌పై పట్టుతోనే సక్సెస్

ఆరు శాతం మందిని మాత్రమే తుది జాబితాకు ఎంపిక చేసే యూజీసీ నెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలి.

పేపర్–1కు ఉమ్మడిగా

రెండు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహించే పేపర్–1లో అభ్యర్థుల టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్–2 సబ్జెక్ట్ పేపర్

పేపర్–2లో ప్రశ్నలు పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు.. అన్ని అంశాలపై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

ఆయా అంశాలను చదివేటప్పుడే అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఎందుకంటే.. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతోంది.

ఆరు శాతం మంది మాత్రమే

మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా (అసిస్టెంట్ ప్రొఫెసర్) ప్రకటిస్తారు. అదేవిధంగా జేఆర్ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ అభ్యర్థుల ఎంపికలోనూ కనీస అర్హత మార్కుల ఆధారంగా ఉత్తీర్ణులను ప్రకటించనున్నారు. ఇందుకోసం పలు స్లాట్లలో నిర్వహించనున్న పరీక్షను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపడతారు.

నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్టులకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం–అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు రూ.67 వేలు బేసిక్ పే చెల్లించాలని యూజీసీ నిర్దేశించింది.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో రెండేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత మరో రెండేళ్లు సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది.
- జేఆర్ఎఫ్ హోదాలో మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేల ఫెలోషిప్ అందుతుంది.
- జేఆర్ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.
- జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారు సైంటిస్ట్‌లుగా కెరీర్ ప్రారంభించొచ్చు.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- ఆర్ట్స్,హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 28.10.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 30, 31 అక్టోబర్ 2023
- **పరీక్ష తేదీలు:** 06.12.2023 నుంచి 22.12.2023 వరకు
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in